





# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 328

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 19 మే 2026


## బుల్లెట్ వేగంతో బుల్లెట్ మోటార్ సైకిల్ ప్రాజెక్టు

- సీఎం చంద్రబాబుతో రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ ప్రతినిధుల భేటీ
- బుల్లెట్ వాహన మోడళ్లను పరిశీలించిన సీఎం





**అమరావతి,కలంకౌంటర్ :** బుల్లెట్ వేగంతో రాష్ట్రంలో బుల్లెట్ మోటార్ సైకిల్ ప్రాజెక్టు ఏర్పాటు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి సమీపంలో ఏర్పాటు చేయనున్న రాయల్ ఎన్ ఫీల్డ్ ప్రాజెక్టును 18 నెలల్లో నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని దీనికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహకారాన్ని అందిస్తుందని సీఎం వెల్లడించారు. రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ సీఈఓ గోవింద రాజన్ సోమవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ యూనిట్ కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రోత్సాహకాలను కల్పించటంపై ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాళ్లకుప్పం, వానల్లూరు గ్రామాల వద్ద రూ.2500 కోట్ల పెట్టుబడితో బుల్లెట్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అత్యాధునిక తయారీ యూనిట్‌తో పాటు టెస్టింగ్ ట్రాక్, పరిశోధనా కేంద్రం, వెండార్ పార్క్ ఎకోసిస్టమ్ కూడా నిర్మిస్తామని అన్నారు. ఈ



ప్లాంట్ ద్వారా ఏడాదికి 9 లక్షల మోటార్ సైకిళ్లు ఉత్పత్తి చేయనున్నట్టు రాయల్ ఎన్ ఫీల్డ్ సీఈఓ గోవిందరాజన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. త్వరలో ఫ్లైయింగ్ ఫ్లీ సీ6 పేరిట ఎలక్ట్రిక్ వేరియంట్ మోడల్‌ను కూడా తీసుకురానున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం ఆంధ్రప్రదేశ్ లో రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పాదనకు సంబంధించి చేపట్టిన వివిధ ప్రాజెక్టులపై రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రతినిధులకు వివరించారు. సౌర, పవన విద్యుత్ తో పాటు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ ప్రాజెక్టుల గురించి వారికి తెలియచేశారు. అనంతరం రాయల్ ఎన్ ఫీల్డ్ ప్రతినిధులు సీఎంకు బుల్లెట్ 350 మినియేచర్ మోడల్‌ను ముఖ్యమంత్రికి అందించారు. ఈ సందర్భంగా బుల్లెట్ 350 మోటార్ సైకిళ్లకు సంబంధించిన మోడళ్లను సీఎం పరిశీలించారు. హెల్మెట్ ధరించి సీఎం బుల్లెట్ ఎక్కారు.



## మహారాష్ట్ర విద్యార్థులతో యువ సంగం కార్యక్రమం లో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్

–విజయవాడ, కలంకౌంటర్ :





## ఉద్యాన రైతుల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

### – మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఉద్యాన పంటల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. స్వీట్ ఆరెంజ్ తోటల్లో నీటి ఒత్తిడి పరిస్థితులపై ఇప్పటికే రెండు నెలల క్రితమే అనంతపురం జిల్లాలో అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఈ అంశంపై శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు ఫీల్డ్ విజిట్‌లు నిర్వహించి పరిస్థితిని సమీక్షిస్తున్నారని, రైతులకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో మొత్తం 37 వేల హెక్టార్ల స్వీట్ ఆరెంజ్ తోటలు ఉండగా, అందులో 2,260 హెక్టార్లలో సాగునీటి సమస్యను గుర్తించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైతులు లైవ్ మల్చింగ్, వీడ్ మ్యాట్ వినియోగం, ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేయడం, అవసరమైన చోట్ల నీటిని తరలించి జీవనాధార నీటి సరఫరా చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. ప్రత్యేకంగా మూడు గ్రామాల్లో 875 హెక్టార్లలో తీవ్రమైన నీటి కొరత నెలకొన్నదని, రైతులు భారీ వ్యయంతో నీటిని తరలించి తోటలను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అయితే రవాణా వ్యయం అధికంగా ఉండటం, ఇతర ప్రాంతాల్లో కూడా తోటలు ఉండటంతో ఇద్దరు రైతులు కలిపి సుమారు 4.5 హెక్టార్ల తోటలను వదిలివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌లో నీటి కొరత కారణంగా ఆయా గ్రామాల చెరువులు నింపబడలేదని, చెరువులు నింపగలిగితే పరిస్థితి కొంత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ఈ మొత్తం అంశంపై జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించామని, ఆయన ప్రత్యక్ష పర్యవేక్షణలో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే యాడికి మండలంలో కూడా కొన్ని నెలల క్రితం ఆమ్ల నిమ్మ పంటకు సాగునీటి సమస్య ఏర్పడిందని గుర్తుచేశారు. రైతులు నీటిని తరలించి పంటలను కాపాడుకోవడంతో పాటు, ప్రస్తుతం ఆమ్ల నిమ్మ ధరలు అధికంగా ఉండటం వల్ల వారికి మంచి ఆదాయం లభించిందని చెప్పారు. రైతులు తీవ్ర ఆర్థిక భారం భరించి పంటలను కాపాడుకునేందుకు కృషి చేస్తున్న నేపథ్యంలో, వారికి నీటి రవాణా ఖర్చు అందించే అంశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

## ఇరిగేషన్ క్యాలెండర్ లో మరో 11 ప్రాజెక్టులకు ప్రాధాన్యత

- 2లో

-జలవనరుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

## పెండింగ్ వ్యవసాయ కనెక్షన్లు తక్షణమే మంజూరు చేయండి

### -- మంత్రి గొట్టిపాటి రవి కుమార్



- 2లో

## "విద్య"తోనే పేదరిక నిర్మూలన

- పేద మైనారిటీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి ఇంటర్ విద్య
- ప్రతిభావంతులను గుర్తించేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష సక్సెస్
- రాష్ట్రవ్యాప్తంగా 6605 మంది హాజరు
- మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి
- నిర్వహణ అధికారులకు మంత్రి అభినందన



**అమరావతి,కలంకౌంటర్ :** విద్యతోనే యువత తాము అనుకున్న ఉన్నత స్థాయి లకు ఎదగగలుగుతారని, తద్వారా సమాజాభివృద్ధిలో తమ వంతు భాగస్వామ్యం కావాలని, విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ వక్ఫ్ బోర్డు ద్వారా ఉచిత కార్పొరేట్ ఇంటర్ విద్య కోసం ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించేందుకు నిర్వహించిన లితాలీమ్ ఏ హునర్" ప్రవేశ పరీక్ష విజయవంతమైనట్లు సోమవారం అమరావతిలో విడుదల చేసిన ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 జిల్లాలలో 27 కేంద్రాలలో ప్రవేశ పరీక్షను ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిర్వహించడం జరిగిందని వెల్లడించారు. కార్పొరేట్ కళాశాలలో ఉచిత ఇంటర్ రెసిడెన్షియల్ విద్య కోసం వక్ఫ్ బోర్డు ద్వారా అర్హులైన, ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 7392 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. అయితే ప్రవేశ పరీక్షకు 6605 మంది హాజరయ్యారని,787 మంది హాజరు కాలేదని,89.35% హాజరు నమోదైనట్లు మంత్రి తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరైన వారిలో బాలికల శాతం ఎక్కువగా ఉన్నారన్నారు. పేద ముస్లిం మైనారిటీ కుటుంబాలలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత విద్య అభ్యసించేందుకు బలమైన పునాదులు వేయుటకు ఇంటర్మీడియేట్ విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ద్వారా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఇందు కోసం "తాలీమ్ ఏ హునర్" పథకం ద్వారా విద్యార్థులను ఎంపిక చేసేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహణ కు శ్రీకారం చుట్టడం జరిగిందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఈ పథకానికి మైనారిటీ వర్గాలతో పాటు అన్ని వైపుల నుండి ప్రభుత్వానికి, వక్ఫ్ బోర్డుకు, ముఖ్యమంత్రికి ప్రశంసల వెల్లువలు వచ్చాయన్నారు. "తాలీమ్ ఏ హునర్ "పరీక్ష సజావుగా నిర్వహించినందుకు ఆయా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, మైనారిటీ శాఖ అధికారులు, సిబ్బందికి, ఇతర సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందికి, విస్తృత ప్రచారం కల్పించిన పాత్రికేయులకు మంత్రి ఫరూక్ ధన్యవాదాలు తెలిపారు.




# ఇరిగేషన్ క్యాలెండర్ లో మరో 11 ప్రాజెక్టులకు ప్రాధాన్యత

## -జలవనరుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి,కలంకౌంటర్ :** ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల నిర్మాణం, శంకుస్థాపనలు చేపట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యతా క్రమంలో ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో 25 ఇరిగేషన్ ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ ను సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ క్రమంలో సోమవారం రాష్ట్ర సచివాలయంలో పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. దీంట్లో భాగంగా ఇరిగేషన్ క్యాలెండర్ అంశంపై చర్చించారు. గతంలో ప్రకటించిన ప్రాజెక్టులు కాకుండా...ప్రాధాన్యత కలిగిన మరో 11 ప్రాజెక్టుల పనులు కూడా చేపట్టాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. ఆ మేరకు ఆ 11 ప్రాజెక్టులను ఇరిగేషన్ క్యాలెండరులో చేర్చాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, సివిల్ వర్క్స్ వంటి వాటికి ఎలాంటి నిధుల కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ అధికారులను సూచించారు. గతంలో ప్రకటించిన 25...సమీక్షలో ప్రకటించిన 11 ప్రాజెక్టులను ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా తీసుకుని ప్రకటించిన ఇరిగేషన్ క్యాలెండర్ కు అనుగుణంగా పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

**నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పోలవరం పనులు ..** సమీక్షా సమావేశం సందర్భంగా పోలవరం సహా వివిధ సాగు నీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పోలవరం ప్రాజెక్టులో సివిల్ వర్క్స్ 88 శాతం పూర్తి అయ్యాయని అధికారులు వెల్లడించారు. భూసేకరణ 93 శాతం పూర్తైందని...నిర్వాసితుల తరలింపు 45 శాతం పూర్తి అయ్యిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీ నాటికి డయాఫ్రాం వాల్ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులు 2027 మార్చి 31 నాటికి పూర్తి అవుతాయని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. పోలవరం కుడి కాలువను అనుసంధానించే ట్విన్ టన్నెల్స్ పనులు 85 శాతం పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. ఎడమ కాలువ అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్ పనులను చేపడుతున్నట్టు వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు.. వివిధ ప్రాజెక్టుల పురోగతిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. హంద్రీనీవా ఫేజ్ 1 లో భాగంగా కాలువల వెడల్పు 92 శాతం పూర్తి అయ్యిందని అధికారులు చెప్పారు. ఫేజ్ 2 కుప్పం- పుంగనూరు కాలువల లైనింగ్ 85 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. మల్యాల లిఫ్ట్ నుంచి రాయలసీమ ప్రాంతానికి తొలిసారిగా 52 టీఎంసీల నీటిని తరలించామని చెప్పారు. మొత్తంగా 432 చెరువులు పూర్తిగా నింపామని వెల్లడించారు. జూన్ 2024 నుంచి ఇప్పటి వరకూ రూ.2123 కోట్లు వ్యయం చేశామని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ప్రతీ నెలా పోలవరం పనుల పురోగతిపై సమీక్షిస్తాను. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-1,2 పనులు చెప్పిన సమయానికి పూర్తి చేయాల్సిందే. ఈ ఏడాది జూలై నెల నుంచి పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఎడమ కాలువ నుంచి నీరు అందివ్వాలి. ఎడమకాలువ నీరు మేఘాద్రిగడ్డకు పోలవరం జలాలు తీసుకువెళ్లాక అక్కడి నుంచి వంశధార-నాగావళి-చంపావతి వరకూ నీరు వెళ్లేలా చూడాలి. మేఘాద్రి గడ్డ నుంచి చంపావతి లింక్ కు ఎంత వ్యయం అవుతుందో అధ్యయనం చేయాలి. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందించే విషయంలో చట్టప్రకారం ముందుకు వెళ్లాలి. 2027 ఏప్రిల్ నాటికి నిర్వాసితుల తరలింపును పూర్తి చేయాలి. ఎలాంటి వివాదాలు లేకుండా ఆర్ అండ్ ఆర్ వేగంగా పూర్తి కావాలి. పోలవరం స్పిల్ వే దిగువన ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. బెస్ట్ టూరిజం ప్రాంతంగా పోలవరం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం కావాలి."అని సీఎం సూచించారు.

**వెలిగొండకు హై ప్రయార్టీ..** "వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ జూలై నాటికి పూర్తి కావాలి. హెడ్ వర్క్స్, కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూసేకరణ లాంటి పనుల కోసం ఇంకా రూ. 2019 కోట్లు అవసరం. టీబీఎంను తొలగించి అడ్డంకులు లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్ బ్యాలెన్సు పనులు వేగంగా పూర్తి కావాలి. అడవిపల్లి, శ్రీనివాసపురం నుంచి నీవా కాలువ ద్వారా చిత్తూరుకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. హంద్రీ నుంచి నీవా వరకూ నీళ్లు తీసుకెళ్లేలా ప్రాధాన్యతగా తీసుకుని పనులు పూర్తి కావాలి. నీళ్లు చూస్తే ప్రజల్లో ఓ నమ్మకం వస్తుంది. మైదుకూరు, మడకశిర లాంటి చివరి ప్రాంతాలకు నీళ్లు వెళ్లాలి. నీవాకు ఈ ఏడాది నీరు ఇచ్చేలా లక్ష్యం పెట్టుకోవాలి. కల్యాణి డ్యామ్ నీవా బ్రాంచ్ కెనాల్ ద్వారా మూలపల్లి చెరువుకు నీరు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు కాలువ పనులు వచ్చే ఏడాది జూలై నాటికి పూర్తి కావాలి. వరికెపుడిశెలను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించిన ఇంపాక్ట్ స్టడీ చేయాలి. అంతరాష్ట్ర సమస్యలు లేకుండా ప్రాజెక్టులు పూర్తి చేసుకుందాం. నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయమై కేంద్రంతో మాట్లాడదాం. గోదావరి-కావేరి అనుసంధానం పైనా కేంద్రంతో సంప్రదింపులు జరుపుదాం."అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**ఖరీఫ్ కు నీరిచ్చే అంశంపై జలవనరుల శాఖకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం..** "ఎల్ నినో లాంటి పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు అంచనాలను సిద్ధం చేసుకుంటూ పంటలు వేసేలా రైతులను సమాయత్తం చేయాలి. నెల్లూరు సాగు తీరును మార్చేలా చర్యలు తీసుకోవాలి. ఈసారి రెయిన్ ఫాల్ మైనస్ 3 శాతంగా ఉంది. భూగర్భ నీటి నిల్వలు 9.49 మీటర్లుగా ఉన్నాయి..గతేడాదితో పోలిస్తే 0.5 మీటర్లు ఎక్కువ ఉంది.

# సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకున్న యార్లగడ్డ





**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని సోమవారం ప్రభుత్వం విప్ మరియు గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ్ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ ముఖ్య అర్చకులు బుద్దు సతీష్ శర్మ ఘన స్వాగతం పలికారు .అనంతరం స్వామివారి నాగపుటలో పాలు పోసి సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. యార్లగడ్డ వెంకట్రావు కుటుంబ సభ్యులకు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ అచ్యుత మధుసూదన్ రావు , మోపిదేవి ఎస్ఐ గౌతమ్ కుమార్,దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 24 వరకు వార్డుల పునర్విభజన ముసాయిదాపై సలహాలు, సూచనల స్వీకరణ

## -కమిషనర్ (ఎఫ్.ఏ.సి)శారదా దేవి.



**తిరుపతి,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వం మార్చి 24వ తేదీ జారీ చేసిన జీవో నెంబర్ 570, సిడిఎంఏ వారి ఉత్తర్వులు తేదీ.25-04-2026 ఆర్ఓసి నం.13032/2/2026/ఎ1-1 మేరకు తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం ఉన్న 50 ఎన్నికల వార్డులను 66 వార్డులుగా పునర్విభజనకు సంబంధించి ప్రతిపాదిత ముసాయిదాను సోమవారం నుండి ప్రచురించినట్లు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డుల సరిహద్దులతో కూడిన ప్రతిపాదిత ముసాయిదాను అధికారికంగా ప్రచురించి, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ ముసాయిదాను రూపొందించినట్లు పేర్కొన్నారు. ముసాయిదాపై ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు ఏవైనా ఉంటే ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నగరపాలక కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంకు వ్రాతపూర్వకంగా సమర్పించాలని కమిషనర్ (ఎఫ్.ఏ.సి) ఆ ప్రకటనలో కోరారు.

# పన్ను బకాయి దారులకు తాఖీదులు సిద్ధం - కమిషనర్ బోస్



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ఏళ్ల తరబడి పన్నుబకాయలను చెల్లించని గృహ యజమానులకు త్వరలో తాకీదులు అందించనున్నామని ఉయ్యూరు పురపాలక కమిషనర్ ఎం సుభాష్ చంద్రబోస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీకి ఇంటి పన్ను నీటి పన్ను ఖాళీ స్థల పన్ను వృత్తి పన్ను వంటివి ఏళ్ల తరబడి కోట్ల రూపాయలుగా పేరుకు పోయాయని తెలిపారు. పట్టణంలో 10,897 అసెస్మెంట్లు ఉండగా, ఐదు సంవత్సరాలుగా ఆస్తి పన్ను చెల్లించని వారు 52 మంది, నాలుగేళ్ల బకాయి దారులు 936 మంది, మూడేళ్ల బకాయిదారులు 843, రెండేళ్ల బకాయిదారులు 1264, సంవత్సరం బకాయిదారులు 1785 మంది ఉన్నారని వీరి ద్వారా రు. 4.97 కోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉందని వివరించారు. ఖాళీ స్థల పన్ను రూ. 60.49 లక్షలు, నీటి పన్ను బకాయిలు రు.70. 94 లక్షలు ఉన్నాయని చెప్పారు. కోట్ల రూపాయలు బకాయిల వల్ల పట్టణంలో అభివృద్ధి పనులు పడుతున్నాయని, ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు నెల ఒక ఇంటికి రూ 10 లక్షల విద్యుత్ ఛార్జీలు చెల్లించాల్సిందని వసూళ్లు ఆ స్థాయిలో జరగటం లేదని చెప్పారు. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు కఠిన చర్యలు తీసుకోనున్నామని, బకాయి దారులకు నోటీసులు జారీ చేయనున్నామని, అప్పటికి స్పందించకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే పన్ను బకాయిలు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాజ్ ఆచార్యకు "దశాబ్ది సేవా పురస్కారం" ప్రదానం







**హైదరాబాద్,కలంకౌంటర్ :** తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ప్రముఖ మనస్తత్వవేత్త , సినీ దర్శకుడు రాజ్ ఆచార్య, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా "దశాబ్ది సేవా పురస్కారాన్ని" అందుకున్నారు. తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా రాజ్ ఆచార్య మాట్లాడుతూ, సమాజ శ్రేయస్సు కోసం మనస్తత్వవేత్తలు తమ వృత్తిపరమైన నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రతి రంగంలోనూ మనస్తత్వ సేవల అవసరం ఎంతో ఉందని, అయితే ప్రభుత్వం ఇంకా మనస్తత్వవేత్తల సేవలను పూర్తిస్థాయిలో గుర్తించి వినియోగించుకోవాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణలో మనస్తత్వ నిపుణులకు మెరుగైన వృత్తిపరమైన అవకాశాలు మరియు ఉపాధి కల్పించే లక్ష్యంతో, ప్రత్యేకంగా ఒక "స్టేట్ కౌన్సిల్" ఏర్పాటు కోసం కృషి చేస్తున్న అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ముత్యూరి రామచందర్ ప్రయత్నాలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. సమాజంలో ఎదురవుతున్న ఆత్మహత్యలు, హత్యలు, గృహ హింస, యువత వ్యసనాలకు బానిస కావడం వంటి తీవ్రమైన సమస్యలను అరికట్టడంలో మనస్తత్వవేత్తల పాత్ర అత్యంత కీలకమని రాజ్ ఆచార్య పేర్కొన్నారు. సమాజంలో నిత్యం జరుగుతున్న కలచివేసే సంఘటనలను విశ్లేషించి, వాటికి సరైన పరిష్కారాలను మరియు మార్గదర్శకత్వాన్ని మనస్తత్వవేత్తలు అందించగలరని ఆయన తెలిపారు. యువ మనస్తత్వవేత్తలు మరియు సైకాలజీ విద్యార్థులు తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్లో సభ్యత్వం తీసుకోవాలని, సంస్థ నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన కోరారు. అసోసియేషన్లో చేరడానికి ఆసక్తి ఉన్నవారు 9059958271 నంబరులో రాజ్ ఆచార్యను సంప్రదించవచ్చు.

# ఉయ్యూరులో వార్డుల విభజన

**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ఉయ్యూరు పురపాలక సంఘం పరిధిలో గతంలో ఉన్న 20 వార్డులను పునర్విభజించి ప్రభుత్వ ఆదేశాల మేరకు 32 వార్డులుగా విడదీశామని కమిషనర్ ఎం. సుభాష్ చంద్రబోస్ తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా మున్సిపల్ శాఖ డైరెక్టర్, కమిషనరు ఆదేశాల మేరకు పునర్విభజన జాబితాను విడుదల చేయడం జరిగిందన్నారు. డోర్, సర్వే నంబర్ల వారీగా వార్డు హద్దులు, ఓటర్ల సంఖ్య, నిర్ణీత నమూనాలో పొందుపర్చి శనివారం విడుదల చేశారని చెప్పారు. అలాగే ఆయా జాబితా, వార్డుల నమూనాలను పట్టణంలోని సచివాలయాలు, ప్రభుత్వ, పురపాలక సంఘం కార్యాలయాల్లోని నోటీసు బోర్డులో ఉంచామన్నారు. ఈ డ్రాఫ్ట్ ప్రతిపాదనలపై ప్రజల నుంచి ఎలాంటి అభ్యంతరాలున్నా సోమవారం నుంచి ఏడు రోజుల లోపు కమిషనరుకు లిఖిత పూర్వకంగా తెలియచేయాలని సూచించారు.

# పెండింగ్ వ్యవసాయ కనెక్షన్లు తక్షణమే మంజూరు చేయండి -- మంత్రి గొట్టిపాటి రవి కుమార్



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న అన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను తక్షణం మంజూరు చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు లోతేటి శివ శంకర్, పృథ్వీ తేజ్ ఇమ్మడి, పి.పుల్లారెడ్డిలతో సోమవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్లో మంత్రి మాట్లాడుతూ.. వేసవిలో గృహ, వ్యాపార, పారిశ్రామిక వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సాంకేతిక సమస్యల కారణంగా ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే తక్షణం ప్రజలకు సమాచారం అందించడంతో పాటు సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అధిక ఉష్ణోగ్రతల కారణంగా ట్రాన్స్ఫార్మర్లు కాలిపోవడం వంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నందున క్షేత్ర స్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన సామగ్రి సంసిద్ధంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్య పథకాలైన సూర్యఘర్, పీఎం కుసుమ్, ఆర్డీఎస్ఎస్ కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సూర్యఘర్ పథకం లో భాగంగా ఎస్సీ లబ్ధిదారుల లక్ష్యంగా పెట్టుకున్న 6 లక్షల కనెక్షన్లను జూలై నాటికి పూర్తి చేయడంతో పాటు ఇతర వర్గాలకు కూడా సోలార్ కనెక్షన్ల ను అందించే కార్యక్రమాన్ని వేగవంతం చేయడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాన్ని త్వరగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# సాతులూరు వద్ద ప్రధాన కాలువ గట్లు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కాగిత



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** కూటమి పాలనలో అభివృద్ధి పనులకు ఆంక్షలు లేవని నిత్యం అభివృద్ధి పనులు జరుగుతూనే ఉంటాయని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. బంటుమిల్లి మండలంలో ప్రధాన కాలువైన బంటుమిల్లి ప్రధాన కాలువకు సాతులూరు గ్రామం వద్ద పంట కాలువ గట్టులు పెద్దవి చేసే కార్యక్రమం పనులకు సోమవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటమీ ప్రభుత్వంలో రైతుల కోసం ప్రజల కోసం నిత్యం అభివృద్ధి పనులు జరుగుతూనే ఉంటాయన్నారు బంటుమిల్లి ప్రధాన కాలవకుండా గల ఆయకట్టు పొలాలు ముంపుగురి కాకుండా వరదల సమయంలో గట్లు తెగిపోకుండా ముందుచూపుతో ఈ కాలువ గట్లను బలపరిచే కార్యక్రమం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు ఇరిగేషన్ అధికారులు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణ, భద్రతకు ప్రాధాన్యత - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్





**విజయనగరం,కలంకౌంటర్ :** మహిళల రక్షణ, భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఎస్.కోట మండలం బొడ్డవర జంక్షను వద్ద మహిళలు, ప్రజలతో జిల్లా ఎస్పీ మమేకమై వారికి మహిళల భద్రత, సైబరు భద్రత పట్ల అవగాహన కల్పించడంతోపాటు, యువత చెడు వ్యసనాలకు, గంజాయికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - మహిళల రక్షణ, భద్రతకు జిల్లా పోలీసుశాఖ అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. మహిళల భద్రత పట్ల ఒకవైపు మహిళలను చైతన్యం చేయడం, ఆపద సమయాల్లో తమ స్వీయ రక్షణకు ఆత్మరక్షణ మెళుకువలు విద్యార్థినులకు నేర్పించడం, వారికి రక్షణగా ఉండే చట్టాలు పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆపద సమయంలో పోలీసుల సహాయంను పొందేందుకు ప్రతీ ఒక్కరి మొబైల్ ఫోనులో శక్తి యాప్ డౌన్లోడు చేసుకోవాలన్నారు. మహిళలు ఆపద సమయంలో శక్తి (ఎస్.ఓ.ఎస్.) బటన్ ప్రెస్ చేయడం లేదా డయల్ 100/112 ఫోన్ చేసి, పోలీసులు సహాయం పొందవచ్చునని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అన్నారు. అవగాహన లోపంతో ప్రజలు సైబరు నేరగాళ్ళ ఉచ్చుకు చిక్కుతూ డబ్బులను నష్టపోతున్నారన్నారు. సైబరు మోసగాళ్ళు ప్రజలను ఆకర్షించేందుకు ప్రలోభాలకు గురిచేస్తూ వాట్సాప్, ఎస్.ఎం.ఎస్. సందేశాలను, లింకులను పంపుతారన్నారు. ఇటువంటి మెసేజ్ ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబరు మోసగాళ్ళు పంపే లింకులపై క్లిక్ చేయవద్దని, వారికి ఓ.టి.పి. నంబర్లు చెప్పవద్దన్నారు. సర్వేలు, జనాభా లెక్కలు పేరుతో బ్యాంకు ఖాతా వివరాలు, చిరునామా, ఆధార్, ఒ.టి.పి. నంబర్లు అడిగితే గోప్యత పాటించాలన్నారు. ఇంకొంతమంది సైబరు నేరగాళ్ళు తాము పంపిన పార్శిల్స్ మాదక ద్రవ్యాలు లభ్యమయ్యాయని, పోలీసు కేసు నమోదయ్యిందని చెప్పి పోలీసు అధికారులు, మెజిస్ట్రేటు వేషధారణలో వాట్సాప్ కాల్స్ చేసి, తమను డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లుగా భయపెట్టి, డబ్బులను కొల్లగొడుతున్నారన్నారు. ఇటువంటి వ్యక్తుల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్టు పేరుతో ఎవరైనా బెదిరిస్తే స్థానిక పోలీసులకు లేదా 1930కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సూచించారు. యువత క్రికెట్ బెట్టింగులకు పాల్పడడం, గంజాయి, మద్యం వంటి చెడు వ్యసనాలకు లోనవుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. విజ్ఞానాన్ని పెంచుకొనేందుకు ఇంటర్నెట్ను వినియోగించుకోవాలని, సోషల్ మీడియా, రీల్స్, ఫేస్ బుక్ వంటి మోజులో పడవద్దని, గంజాయికి దూరంగా ఉండాలన్నారు. గంజాయి అక్రమ రవాణను నియంత్రించేందుకు జిల్లా పోలీసుశాఖ కఠిన చర్యలు చేపడుతున్నదని, అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు చేపడుతూ, వారి ఆస్తులను జప్తు చేయడంతోపాటు, వారిపై హిస్టరీ షీట్లును ప్రారంభించి, వారి కదలికలపై నిఘా పెడుతున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు 1972 లేదా డయల్ 100/112కు సమాచారం అందించాలని ప్రజలను, యువతను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు. బొడ్డవర కూడలిలో ప్రజలతో జిల్లా ఎస్పీ మమేకమైన సమయంలో ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, ఎస్.కోట సిఐ వి.నారాయణమూర్తి ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భార్యపై హత్యాయత్నం కేసులో భర్త అరెస్ట్




**ఉయ్యూరు,కలంకౌంటర్ :** భార్య తలపై బండ రాయితో మోదీ హత్యాయత్నం చేసిన భర్తను పట్టణ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఉయ్యూరు పట్టణ పోలీస్ సిఐ టీవీ రామారావు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. పట్టణానికి చెందిన బొర్రా పుష్ప (35) బుర్ర సాంబయ్య (36) లకు సుమారు 15 సంవత్సరాల క్రితం వివాహం అయిందని, ఇద్దరికీ రెండో వివాహం కాగా ఇద్దరు మగ సంతానం ఉన్నారని, కొంతకాలంగా కుటుంబ కలహాలతో ఇద్దరు విడివిడిగా జీవిస్తున్నారని తెలిపారు. గతంలో బాధితురాలు తన భర్త వేధిస్తున్నాడంటూ పోలీసులు ఫిర్యాదు చేసిందని, ఆ కేసు కోర్టు పరిశీలనలో ఉందని చెప్పారు. విడిగా ఉంటున్నప్పటికీ భార్యపై అనుమానం పెంచుకున్న సాంబయ్య ఆదివారం తెల్లారుజామున 4 గంటల సమయంలో కాటూరు రోడ్డులో బాధితురాలను అడ్డగించి నడిరోడ్డుపై రాయితో ముఖం మరియు తలపై దాడి చేసి గాయాల గురిచేసాడని చెప్పారు. సమాచారం అందుకున్న వెంటనే గాయాల పాలయున్న పుష్పను ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితుడు సాంబయ్య ను సోమవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఆయన వివరించారు. కాగా సంఘటన జరిగిన సమయంలో ముద్దాయి చేతిలో ఎటువంటి ప్రమాదకరమైన ఆయుధం లేకపోయినప్పటికీ సంఘటన చూస్తున్న వారు ఎవరు బాధితురాలు రక్షించడానికి ముందుకు రాకపోవడం ప్రేక్షకులుగా నిలబడి వీడియోలు, ఫోటోలు తీయడం అమానవీయమని, మంచి సంప్రదాయం కాదని ఆవేదన వ్యక్తం చేశారు ఇటువంటి సంఘటన జరిగినప్పుడు ప్రజలు గట్టిగా కేకలు వేసి పదిమందిని కూడగట్టి సురక్షితమైన దూరంలో ఉంటూ ముద్దాయిని అడ్డుకునే ప్రయత్నం చేయాలని బాధితురాలను తప్పించటం, పోలీసులు సమాచారం ఇవ్వడం వంటి బాధ్యతమైన చర్యలు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్ఐ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ సి డి క్లినిక్ ప్రారంభం




**కందుకూరు,కలంకౌంటర్ :** మీ ఆరోగ్యం మీ చేతుల్లో -- బాధ్యత మీది -- భరోసా మాది" అనే ప్రభుత్వ నినాదంతో జిల్లా ద్వితీయ స్థాయి ఆరోగ్య విభాగం ఆదేశాలనుసారం "ఎన్సిడి క్లినిక్ - 333" సేవలను కందుకూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఎన్ సి డి (నాన్ - కమ్యూనికేబుల్ డీజిసెస్ ) క్లినిక్ సెంటర్‌ను మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్రాణి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తో కలిసి ప్రారంభించారు ఎన్ సి డి అంటే సంక్రమణ చెందని వ్యాధులు ఇవి జన్యు, శారీరక, పర్యావరణ మరియు జీవనశైలి సంబంధిత కారణాల వల్ల కలిగే దీర్ఘకాలిక వ్యాధులు. ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి సమస్యలను ముందుగానే గుర్తించి నివారించేందుకు ఈ క్లినిక్ ఉపయోగపడుతుంది. ఈ సందర్భంగా డాక్టర్ ఇంద్రాణి మాట్లాడుతూ, ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్ సి డి కార్యక్రమానికి సంబంధించిన వివరాలను డాక్టర్ తులసిరామ్ వెల్లడిస్తూ, 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చినప్పుడు షుగర్, బీపీ, క్యాన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే 60 సంవత్సరాలు పైబడిన వారికి జెరియాట్రిక్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తగ్గించడంలో ఎన్సీడీ కీలకపాత్ర వహిస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గడ్డం మాలకొండయ్య, భూషయ్య, తిరుపాలు, మీనా కుమారి, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ తులసిరామ్, డాక్టర్ రమాప్రియతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్దిష్ట గడువులోగా అర్జీలు పరిష్కరిస్తాం

## - జిల్లా ఎస్పీబి. ఉమామహేశ్వర్





**బాపట్ల,కలంకౌంటర్ :** చట్ట పరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా అర్జీలు పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అర్జీదారులకు భరోసా కల్పించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 45 మంది అర్జీదారులు కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు, ఇతర పలు సమస్యలను జిల్లా ఎస్పీ కి విన్నవించుకున్నారు. ఎస్పీ వారితో ముఖాముఖీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి అర్జీలను చట్ట పరిధిలో వేగవంతంగా విచారించి, నిర్ణిత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చెయ్యాలని ఆదేశించారు. అర్జీ దారుల సమస్యను పరిష్కరించడానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని పోలీస్ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్ణకారులను ఆదుకోవాలి-- బాల బ్రహ్మాచారి



**కందుకూరు,కలంకౌంటర్ :** చేతి వృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో కందుకూరు సబ్ కలెక్టర్ కి వినతి పత్రం అందించడం జరిగింది. చేతివృత్తుదారుల సంఘం జిల్లా నాయకులు బాల బ్రహ్మచారి మాట్లాడుతూ చేతి వృత్తిదారుల ఆదుకోవాలని ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు నిధులు ఇవ్వాలని, ప్రతి ఒక్క రజక కుటుంబానికి 200 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇవ్వాలని, వెనకబడిన వర్గాలకు 50 ఏళ్లు నిండిన ఒకరిక పెన్షన్ ఇవ్వాలని, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్వర్ణకారులు పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ రేట్లు తగ్గించాలని ధర్నా



**కందుకూరు,కలంకౌంటర్ :** పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ, కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వైసీపీ నేతలు ధర్నా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, పార్టీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్రంలో లీటరు పెట్రోల్ రూ.113.62, డీజిల్ రూ.101.24కు చేరిందని, చంద్రబాబు ప్రభుత్వం మరో బాదుడే బాదుడు కార్యక్రమం మొదలుపెట్టిందని మధుసూదన్ యాదవ్ విమర్శించారు. గతంలో జగనన్న ప్రభుత్వంలో అమలు చేసిన అన్ని పథకాలు రద్దు చేయడమే కాకుండా, ఇప్పుడు వాహనదారులతో పాటు, కూటమి ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందని అన్నారు. చంద్రబాబుకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్, ఇతర బాదుడు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ హిమవంశీ ను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

# రేపు కావలికి సీఎం చంద్రబాబు... మత్స్యకారుల ఖాతాల్లో రూ.20 వేలు జమ

**అమరావతి, కలంకౌంటర్ :** సముద్రంలో వేట నిషేధ కాలంలో మత్స్యకారుల కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఏపీలోని కూటమి ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది ఆర్థిక భరోసా కల్పించనుంది. 'మత్స్యకారుల సేవలో' పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 1,30,796 మత్స్యకార కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తూ, ఒక్కో కుటుంబానికి రూ.20,000 చొప్పున మొత్తం రూ.262 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించనుంది. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలోని తుమ్మలపెంట గ్రామంలో రేపు (మంగళవారం) జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నిధులను లాంఛనంగా విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మత్స్యకారుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి చాటనున్నారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపల ప్రజనన కాలాన్ని పరిగణనలోకి తీసుకుని వేటపై నిషేధం విధిస్తారు. ఈ సమయంలో ఉపాధి కోల్పోయి మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కేవలం రూ.10,000గా ఉన్న ఈ సహాయాన్ని, ఎన్డీఏ కూటమి తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.20,000కు పెంచింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, బలహీన వర్గాల సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకుంది.

# అంతరించిపోతున్న పంట పొలాలు

## - ప్లాట్లుగా మారి బీడు వారుతున్న పొలాలు


## -కోట్లు పలుకుతున్న ధరలు





**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ఉయ్యూరు పట్టణ, పరిసర గ్రామాల పరిధిలో రియల్ వ్యాపారం జోరుగా సాగుతున్నట్లు రియాల్టర్లు సృష్టించే మాయాజాలం నేపథ్యంలో పంట పొలాలు కనుమరుగై పల్లె పచ్చదనం దూరం అవుతోంది. మళ్లీ వస్తామో రామో అనే మీమాంసతో భూస్వాములు తమ ఎకరాలను వెంచర్లుగా రియల్ టర్లకు అమ్మేస్తున్నారు ఆయనకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ భూముల పంట భూములు కావటం కావటం వీటిని వెంచర్లుగా మార్చటానికి అవసరమయ్యే ప్రభుత్వ అనుమతులన్నీ క్షణాల్లో సృష్టించటం జరుగుతోందని ఫలితంగా పచ్చటిఫలాలతో కలిసిందే గ్రామాలు కాంక్రీట్ జంగిల్ గా మారుతున్నాయని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పరిశీలనలు అనుమతులకు సంబంధించిన లావాదేవీలు ఏమి జరుగుతున్నాయో వందల ఎకరాల్లో సృష్టించబడుతున్న ఈ వెంచర్లకు గంటల వ్యవధిలో అనుమతులు ఎలా వస్తున్నాయో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అనుమతులు లేని వెంచర్లంటూ తర్వాత గగ్గోలు పెట్టి కొనుక్కున్న వారికి ఇబ్బందులు కల్పించే అధికారులు ప్రస్తుతం సౌజన్య చూస్తున్నారు. ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధి పాటు పొరుగున ఉన్న గండిగుంట, కడవకొల్లు, ఆకునూరు, గురజాడ, తాడంకి, మంటాడ గ్రామాల పరిధిలో రోజుకో కొత్తవెంచర్ వెలుస్తూ వందలాది ఎకరాలు ప్లాట్లుగా మారుతున్నాయి. నిన్న మొన్నటివరకు ఎకరం 20 నుంచి 25 లక్షల లోపు ధర ఉన్న పొలాలు ఇప్పుడు కోటి నుంచి మూడు కోట్ల రూపాయలకుపైగా పలుకు తున్నాయి. పొరుగు గ్రామాల్లో పంటలు పండే పొలాల ధరలు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్ల రూపాయలకు కొనుగోలు చేస్తుంటే రైతులు పొలాలను అమ్ముకునేందుకు ముందుకు వస్తున్నా రు. వర్షాకాలంలో ముంపుబారిన పడే పొలాలను సైతం కోట్ల రూపాయలకు కొనుగోలు చేసి ప్లాట్లుగా చేసి రోడ్లు వేసి ముస్తాబు చేయడమే కాక అండర్ గ్రౌండ్ డ్రెయినేజి, అండర్ గ్రౌండ్ కేబుల్ వేస్తామని చెప్పి ప్లాట్లు కొనేవారిని పొరుగు ప్రాంతాల నుంచి కార్లలో తీసుకువచ్చి చూపిస్తున్నారు. అదిగో రాజధాని అమరావతి, ఇదిగో బందరు పోర్టు, పక్కనుంచే ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్లు వస్తున్నా యని చెపుతూ, మచిలీపట్నం విజయవాడ హైవే మన వెంచరు అల్లంత దగ్గరలో ఉందని కొనుగోలు దారులకు గేలం వేస్తున్నారు. ఉయ్యూరు, గండి గుంట, ఆకునూరు, గురజాడ పరిధిలో రెండు దశాబ్దాల క్రితం హైవే దగ్గర పంటపొలాల్లో వేసిన వెంచర్లలో ఇంతవరకు ఒక్క ఇల్లు కూడా లేకుండా ఖాళీగా ఉండి గడ్డి, పొదలు పెరిగి బీడుభూముల్లా కన్పిస్తుండగా ఊరికి దూరంగా వందల ఎకరాల్లో వేసిన వెంచర్లు ఖాళీగా ఉన్నాయి. గండిగుంట, ఆకునూరు, వీరవల్లి, కడవ కొల్లు పరిధిలో డొంక రోడ్లలో ప్రధాన రహదారులకు దూరాన ఉన్న పొలాలు కొనుగోలు చేసి పాట్లుగా మారుస్తున్నారు. హైవేకు రెండు కిలో మీటర్లకు పైగా దూరంగా ఉన్న పొలాల్లో సైతం పాట్లు వేసి అదిగో హైవే అని చూపించి సెంటు పది లక్షలకు పైగా చెబుతు న్నారు. సీఆర్డీఏ అప్రూవల్ ఉందని చూపిస్తూ అధిక ధరకు అమ్ముకుంటున్నారు. దిగువన ఉన్న పొలాలకు సాగునీరందించే కాల్వలు, బోదె లు పూడ్చి ప్లాట్లు వేస్తున్న నేపథ్యంలో దిగువ పొలాల యజమానులు కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకోక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు సంబంధిత శాఖల అధికారులు ఈ వెంచర్ల అనుమతులపై స్పష్టతనివ్వాలని ఆయా గ్రామపంచాయతీలో దీనికి సంబంధించి అభ్యంతరాలు ఉంటే వెల్లడించాలని సామాన్యులు కోరుతున్నారు. కాలువలు డ్రైన్లు వంటి సాగునీటి అవసరాలు పోర్చటం నేరమని కోర్టులు ఆదేశాలు ఉన్నాయని సామాన్యులను బెదిరించే రెవెన్యూ అధికారులు యదేచ్ఛగా వెంచర్ల నిర్మాణం జరుగుతున్న నోరు మెదపరేంటని వారు ప్రశ్నిస్తున్నారు. వెంచర్ల ఏర్పాటులో భాగంగా ఆ కాలనీవాసులు అవసరాలను నిమిత్తం మినహాయించాల్సిన 20 శాతం భూములు మినహాయిస్తున్నారా లేదా వాటిని కూడా రిజిస్ట్రేషన్ చేస్తున్నారా గతంలో ఈ ప్రాంతంలో సంచలమైన ఓ ప్రజా ప్రతినిధి కామన్ సైట్ల రిజిస్ట్రేషన్ వ్యవహారం పునరావతమవుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# మజ్జిగ పంపిణీ



**కలంకౌంటర్ :** స్టార్ హెల్త్ కంపెనీ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, కందుకూరు బ్రాంచ్ టీం అందించిన సహకారంతో అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న మన స్కంధపురి సేవా సమితి చలివేంద్రం వద్ద సోమవారం మజ్జిగ పంపిణీ నిర్వహించారు. ఈ మండుటెండల్లో ప్రజలకు చల్లని ఉపశమనం అందించాలనే సేవా భావంతో ముందుకు వచ్చిన స్టార్ హెల్త్ కందు కూరు టీంకు స్కందపురి సేవా సమితి అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక అభినందనలు తెలిపారు.

# సైకిల్ పై విధులకు హాజరైన జిల్లా కలెక్టర్..




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఇంధన పొదుపులో భాగంగా సైకిల్ పై తమ క్యాంప్ ఆఫీస్ నుండి కలెక్టరేట్లో చాంబర్ వరకు సైకిల్ పై విధులకు హాజరైన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

# యుద్ధాన్ని బూచిగా చూపి ధరలు పెంచడం అన్యాయం.. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి లోకామ్రేడ్ గుండాబత్తుల ఆంజనేయులు గారి భవనంలో సోమవారం సాయంత్రం రైతుసంఘం నాయకులుసమావేశమైనారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఫ్యాక్టో ఎరువుల ధరలను ఇరాన్ యుద్ధం బూచిగ చూపి, విపరీతంగా రెండు దఫాలుగా పెంచడం దారుణమని రైతు సంగం నాయకులు తీవ్రంగా ధ్వజమెత్తారు., గతంలో ఫ్యాక్టర్ పాస్ ఫ్యాక్టమ్ పాస్ ఎరువు 20 20 0 13.. 50 కేజీల బస్తా ?1500 వందల రూపాయలు ఉండేదని, ఈ మధ్యకాలంలో రెండు దఫాలుగా ధరల పెంచడం వలన ? 2100 కు చేరిందని మరియు పెరిగిన ధరలు ఈనెల 16వ తేదీ నుండి అమలులోకి రావడం గమనార్హం అన్నారు. అమ్మోనియం సల్ఫేట్ 970 నుండి 1400 రూపాయలకు పెంచడం జరిగిందని అంటే బస్తాకు 430 రూపాయలు పెంచడం అన్యాయమని ప్రభుత్వరంగ సంస్థ అయినటువంటి ఫ్యాక్టో ఎరువుల ధరను ఇంత దారుణంగా పెంచడం అంటే కంచే..చేను మేసిన పరిస్తితిలా తయారౌతుందని, అందువల్ల ప్రైవేట్ సంస్థలకు కూడా దారి సులభతరం చేసినట్లు అవుతుందన్నారు., ఎరువులు ధరలు పెరగడం , దీనికి తోడు అగ్నికి ఆజ్యం పోసినట్లు , పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడం వల్ల ఎరువులు, పురుగు మందులు ,కలుపు మందులు ధరలు కూడా విపరీతంగా పెరిగిపోతాయని, రైతే రాజు దేశానికి వెన్నుముక అని చెప్పే ప్రభుత్వాలు ఈ రోజున రైతులకు వెన్నుపూసలు తొలగిస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. అసలే వ్యవసాయ ఉప కరణాలు వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు పెరగటం , రైతాంగాన్ని అగాధంలోకి , సంక్షోభంలోకి నెట్టడం అవుతుంది. పీకల్లోతు కష్టాల్లో కురిపి కూరుకుపోయిన రైతాంగానికి గోరుచుట్టుపై రోకలి పోట్లాగా తయారవుతుందని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పోషక ఆధారిత విధానంపై సబ్సిడీలు ఇచ్చి , పెంచిన ధరలను తగ్గించాలని వ్యవసాయ రంగాన్ని, రైతంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు., ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా కమిటీ అధ్యక్ష ,కార్యదర్శులు కోసూరి శివ నాగేంద్రం ,గౌరిశెట్టి నాగేశ్వరరావు లు , బంటుమిల్లి మండల రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు మలిశెట్టి శివరాం ప్రసాద్, లంకదాసుల అజయ్ ఘోష్ మరియు రైతు సంఘం సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్దన్ రావు , జన్యావుల కన్నారావులు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో రైతాంగాన్ని, వ్యవసాయరంగాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు.

# జన హృదయ సామ్రాట్ మీద అభిమానం చాటిన కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జన హృదయ సామ్రాట్, మాజీ మంత్రి,ప్రముఖ పారిశ్రామిక వేత్త టీజీ వెంకటేష్ జన్మదినోత్సవం సందర్భంగా కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి సాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు.

**ఆయురారోగ్యాలు ఇవ్వాలని పూజలు..** మాజీ మంత్రి టీజీ వెంకటేష్ నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో వుండాలని వాసవి అమ్మవారిని ప్రార్థించి వాసవి భవన్ లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సాయానికి చిరునామా టీజీ వెంకటేష్..... సన్నిధి సాయి శ్రీనివాస్ ..**రాష్ట్రంలో ఆర్యవైశ్యులు సంస్థలు అవిశ్రాంతంగా సేవలు అందించడానికి, పేద మధ్యతరగతి ఆర్యవైశ్యులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్నో జీవితాల్లో వెలుగులు నింపుతున్న మనసున్న మారాజు టీజీ వెంకటేష్ అని కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి సాయి శ్రీనివాస్ అన్నారు. పేదలకు సామూహిక వివాహాలు,ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సేవా కార్యక్రమాలు కోసం కోట్లాది రూపాయలు నిధులు ఇస్తూ సాయానికి చిరునామా గా అందరి గుండెల్లో నిలిచారన్నారు. ఈ కార్యక్రమం లో కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడు మామిడి దుష్యంత్, నంబూరి చలపతిరావు, పులవర్తి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వెలంపల్లి తో పడుచూరి ఆత్మీయ కలయిక

**విజయవాడ, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ కడప జిల్లా ప్రొద్దుటూరు కి విచ్చేసిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట మహాసభ పొలిటికల్ మాజీ వైస్ చైర్మన్ పడుచూరి వెంకటేశ్వర్లు, మహాసభ మాజీ విద్యాకమిటీ చైర్మన్, బుధవరపు కృష్ణమూర్తి, కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు దొంతు సుబ్రహ్మణ్యం, వంకదారి రాము, పరిటాల



వెంకటరమణ, కొమ్మూరి కిరణ్, తోటం శెట్టి కృష్ణమూర్తి ,మాడి శెట్టి వెంకట నారాయణ, గుడుగుంట్ల లక్ష్మయ్య, మునగా రాఘవ, కాంబోజి తేజ, నారాయణ సురేష్, అబ్దుల్ రహీమ్, షఫీఉల్లాఖాన్, కర్ణా రఘునాద్ రెడ్డి, యర్రగుంట్ల వాసవి క్లబ్ అధ్యక్షులు, పవన్, క్లబ్ సభ్యులు కలిసి సన్మానం చేశారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com